నాగిరెడ్డిపేట పరీక్ష కేంద్రంలో ఏం జరుగుతోందీ ?

- మాస్‌కాపీయింగ్ జరుగుతున్నదంటూ అధికారులకు అనుమానం..
- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారులు

సోమవారం నాగిరెడ్డిపేట పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న షేక్ సలాం

నాగిరెడ్డిపేట, మార్చి10: నాగిరెడ్డిపేట ఇంటర్ పరీక్ష కేంద్రం సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతున్నది. పరీక్షల తొలిరోజు ఇన్విజిలేటర్లుగా ఎస్జీటీ స్థానంలో స్కూల్ అసిస్టెంట్లు, ఆదర్శ పాఠశాలల ప్రైవేట్ అధ్యాపకులు విధులకు హాజరయ్యారు. దీనిపై స్థానికంగా ఒక ఉపాధ్యాయ సంఘం సహకారంతో..ఇష్టాను సారంగా జరుగుతున్నాయంటూ ఉన్నతాధికారులకు మరో ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో వారిని తొలగించి రెండో రోజు వారి స్థానంలో నూతనంగా ఎస్జీటీలను ఎంఈవో వెంకటేశం నియమించారు. శుక్రవారం కొంత మంది విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు దొరక్కపోవడంతో.. మరోరూంలో కూర్చోబెట్టారు. గంట తర్వాత వారిని వారివారి హాల్‌టికెట్ నంబర్లు ఉన్న గదిలోకి తరలిస్తుండగా.. పలుమార్లు విద్యార్థులు గదుల నుంచి బయటకు వచ్చి వెళ్తుండడంతో సీసీ టీవీ కెమెరాలో గుర్తించిన రాష్ట్ర ఎగ్జామ్ ఆఫీసర్స్ జిల్లా ఎగ్జామ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కేంద్రానికి చేరుకొన్న చీఫ్ సూపరింటెండెంట్ విష్ణును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో జరిగిన విషయాన్ని రాష్ట్ర అధికారులకు వివరించారు. మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు అనుమానించిన అధికారులు.. విధులను నిర్లక్ష్యం చేసిన డిపార్ట్‌మెంటల్ అధికారి అంజయ్య, పరీక్ష కేంద్రానికి హాజరైన మొత్తం ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించారు. వారి స్థానంలో సోమవారం నూతన డీవోగా తాడ్వాయి జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్ మల్లేశం, 14 మంది ఎస్జీటీలను నియమించారు. ఈ విషయమై ఎంఈవోను వివరణ కోరగా జిల్లా ఇంటర్ కళాశాలల అధికారుల ఆదేశాల మేరకు కొత్త వారిని ఇన్విజిలేటర్లుగా పంపినట్లు చెప్పారు. ఈ విషయంపై జిల్లా ఇంటర్ కళాశాలల కన్వీనర్ షేక్ సలాంను వివరణ కోరగా..అలాంటిదేమీ లేదన్నారు. డీవోగా ఉన్న అంజయ్యకు ఆరోగ్యం బాగోలేక మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు చెప్పారు. ఇన్విజిలేటర్లను మార్చడంపై అడుగగా..ఇన్విజిలేటర్లను ప్రతిరోజూ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మార్చుకోవచ్చునన్నారు. కేంద్రంలో పరీక్షలు ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా సజావుగా సాగుతున్నాయన్నారు. పరీక్షలు సజావుగా సాగుతుంటే..కేంద్రం ఇన్ని రకాలుగా గందరగోళం చేసుకోవడంపై స్థానికంగా చర్చనీయంశంగా మారింది. అసలు పరీక్ష కేంద్రంలో ఏం జరుగుతున్నదో గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మార్చి 10 : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో పోటీ పడాలని సూచించారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు సాయిలు, శ్రావణ్, లక్ష్మణ్, రాజేశ్వర్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. 101 ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిన్న దుర్గాప్రసాద్, సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, వైస్ చైర్మన్ నితీశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

కామారెడ్డి రూరల్ , మార్చి 10 : ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ముఖ్య ప్రతినిధి చేపూరి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తిమ్మక్‌పల్లి, చిన్నమల్లారెడ్డిలోని గర్ల్స్ హైస్కూల్‌లో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరఫున పదో తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ముఖ్య ప్రతినిధి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశాంతంగా చదివితే అన్ని అంశాలు గుర్తుంటాయని అన్నారు. చిన్నమల్లారెడ్డికి చెందిన జూనియర్ లెక్చరర్స్ రమేశ్, చిరంజీవి ఆర్థిక సహాయంతో విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు.

కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి కృష్ణారావు, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, చంద్రశేఖర్, కృష్ణకర్, ప్రధానోపాధ్యాయులు నళినీ దేవి, మమత, ఉపాధ్యాయులు మహేశ్, కీర్తి మాలిని, స్వప్నరెడ్డి, శ్రీనివాస్. తబస్సుం పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి, మార్చి 10 : పాల్వంచ శివారులో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. భవానీపేట తండాకు చెంది భూక్య సురేశ్, మాలోత్ తేజ ఇద్దరు సోమవారం మాచారెడ్డికి పని నిమిత్తం వచ్చారు. తిరుగు ప్రయాణంలో పాల్వంచ వద్ద వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలించారు.

వినతిపత్రం అందజేత

నస్రుల్లాబాద్/బాన్సువాడ, మార్చి 10 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన రైతులు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి, బీర్కూర్ తహసీల్దార్ లతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి రైతులు గతంలో వేసుకున్న బండ్ల బాట నుంచి ఇసుక ట్రాక్టర్లు తీసుకెళ్తున్నారని, నక్ష ప్రకారం ఉన్నా.. ప్రభుత్వం వేసిన రోడ్డుపై నుంచి వెళ్లేలా చూడాలని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బీబీపేట్, మార్చి 10 : మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ వద్ద ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఎస్సై ప్రభాకర్, భిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాతరాజు, మండలాధ్యక్షుడు రమేశ్, ఛత్రపతి ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెంచీల కోసం విరాళం

బాన్సువాడ రూరల్, మార్చి 10 : బాన్సువాడ మండలంలోని బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–2008 సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణకు రూ.11 వేల విరాళం అందజేశారు. నూతన బెంచీల కోసం విరాళం అందించారు.

ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మార్చి 10: బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి.. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్‌కలెక్టర్ కిరణ్మయితో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ విజయపాల్‌రెడ్డి, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

బాన్సువాడ/బాన్సువాడ రూరల్, మార్చి 10 : బాన్సువాడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నాయకులు సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మాట్లాడుతూ.. సావిత్రి బాయి పూలే ఓ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రిగా, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆమె స్ఫూర్తితో కేసీఆర్ రాష్ట్రంలో వెయ్యికిపైగా గురుకులాలను స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో మోచి గణేశ్, ఎర్రవట్టి సాయిబాబా, శివసూరి, సంజయ్‌యాదవ్, గోపాల్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో..

బాన్సువాడ రూరల్, మార్చి 10 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో సోమవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మన్నె అనిల్, నల్లోల్ల సాయిలు, గంగారాం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి,మార్చి 10 : మాచారెడ్డిలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం బాబు, రాంచంద్రం, అంబటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

బోర్లంలో అంబేద్కర్ సంఘం నాయకులు..

మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

లక్ష్మాపూర్‌లో పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 10: వ్యవసాయ మోటర్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్‌శాఖ డీఈ విజయసారథి అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యుత్ సిబ్బందితో కలిసి సోమవారం లక్ష్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఉంటే ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు ముట్టవద్దని, సమస్యను విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు. వారు వెంటనే వచ్చి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. రైతులు ఐఎస్ఐ పంప్‌సెట్లను ఉపయోగించాలన్నారు. మోటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటస్వామి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మురికి కాలువలు శుభ్రం

బీటీఎస్ వద్ద డ్రైనేజీలో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భిక్కనూరు, మార్చి 10 : మండలంలోని జంగంపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో డ్రైనేజీలు అస్తవ్యస్తం శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి బాబు జంగంపల్లి నుంచి రాజంపేట్ మండలం తలమడ్ల రోడ్డుపై పారుతున్న మురికి నీరు, బీటీఎస్ వద్ద మహాత్మ గాంధీ జ్యోతి బాపూలే పాఠశాల ఎదుట జాతీయ రహదారి పక్కన ఉన్న డ్రైనేజీని సోమవారం శుభ్రం చేయించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 10 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 38 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లిష్ పేపర్–2కు మొత్తం జనరల్ 6,792 మందికిగాను 6,683 మంది హాజరుకాగా 109 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 1,280 మందికిగాను 1,238 మంది హాజరుకాగా 42 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

రాజకీయ నేతల ఇండ్లల్లో పని చేస్తే సహించబోం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 10 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, కార్మికులతో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కామారెడ్డి మున్సిపల్‌లో చాలా మంది ఎలాంటి పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. కొందరు రాజకీయ నాయకుల ఇండ్లల్లో పని చేస్తున్నారని చెప్పారు. ఇకనుంచి అలా చేస్తే సహించబోమని, ఉద్యోగం ఊడగొడతానని హెచ్చరించారు. డ్యూటీని సక్రమంగా నిర్వహించాలన్నారు. రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరలోనే అందిస్తామని చెప్పారు. అధికారులు కూడా ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. నిజాయితీగా ఉద్యోగం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల వితరణ

రామారెడ్డి, మార్చి 10: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, బాలుర పాఠశాల పదోతరగతి విద్యార్థులకు నారెడ్డి ట్రస్టు వ్యవస్థాపకుడు నారెడ్డి మోహన్‌రెడ్డి పరీక్ష ప్యాడ్లను వితరణ చేశారు. బాలికలు 78 మంది, బాలురు 10 మంది విద్యార్థులకు సోమవారం ఆయన ఎంఈవో ఆనంద్‌రావుతో కలిసి ప్యాడ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయులు బాల్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు యాదగిరి, భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి బాలికల పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

గండివేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు..

గాంధారి, మార్చి 10: మండలంలోని గండివేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం గౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్య పరీక్ష ప్యాడ్లతో పాటు పెన్నులు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీహరి మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

జనగామ మర్రి నుంచి జనగామకు వెళ్లే రోడ్డులో తారు ఊడిపోయి ప్రమాదకరంగా మారిన గుంత

బీబీపేట్, మార్చి 10 : బీబీపేట మండలంలోని జనగామ మర్రి నుంచి జనగామ గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు పడి, తారు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడినా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ దారి గుండా బీబీపేట, దుబ్బాక, కామారెడ్డికి నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తారు.

రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోపడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నూతన మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా శాంత

కార్యవర్గసభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐకేపీ అధికారులు

నాగిరెడ్డిపేట, మార్చి10: మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా బేస్త శాంతను రెండో సారి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల ఇన్‌చార్జి ఎల్లారెడ్డి ఏపీఎం ప్రసన్నరాణి తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం 1995 మ్యాక్స్ చట్టం ప్రకారం మండల మహిళా సమాఖ్య నూతన జనరల్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా మండలంలోని 32 గ్రామ సంఘాల నుంచి దగ్గరలో ఉన్న 3 గ్రామ సంఘాలను కలిపి ఒక నియోజకవర్గంగా విభజించారు. మొత్తం 9 నియోజక వర్గాలు ఏర్పాటు చేసి ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కరిని కార్యనిర్వాహణ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. తొమ్మిది మంది కార్యనిర్వాహణ కమిటీ సభ్యుల నుంచి ముగ్గురిని పాలకవర్గ సభ్యులుగా ఎంపిక చేసి అందులో నుంచి ఒక్కరిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా బేస్త శాంత, కార్యదర్శిగా నాయికోటి మంజుల, కోశాధికారిగా బోయిన మమతను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య విధులు, బాధ్యతలు, ఉప విధులపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్, సీసీ దత్తు, రమేశ్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రశీద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదులు నిల్

లింగంపేట, మార్చి10: తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని గ్రామాల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 10: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ అయిన మల్లాయిపల్లి గ్రామంలో సోమవారం ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి, ముగ్గుపోసి, పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు ప్రత్యేకపూజలు చేసి పనులు మొదలుపెట్టారు.

పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగంపేట, మార్చి10: మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం దామోదర్ తెలిపారు. ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు పద్మ, శివనంద, లావణ్యతోపాటు వంట ఏజెన్సీ నిర్వాహకురాలు తాహెరా బేగంను శాలువా కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించనట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామారెడ్డి విద్యార్థులు

రామారెడ్డి, మార్చి10 : మండలకేంద్రంలో సోమవారం ఉమ్మడి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించారు. స్థానిక బాలికల పాఠశాల, బాలుర పాఠశాల నుంచి కె.నితీశ్, బి.నిశాంత్, టి. వికాస్, డి.సంజన, వి. దీక్ష ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14,15,16వ తేదీల్లో వనపర్తిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ లింగం తెలిపారు.

'మహిళలు ఎందులోనూ తక్కువకాదు'

రామారెడ్డి, మార్చి 10: మహిళలు దేనిలోనూ తక్కువ కాదని, లింగ సమానత్వాన్ని తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటున్నామని డీఎల్ఎస్ఏ జడ్జి టి. నాగరాణి అన్నారు. సదాశివనగర్ మండల కేంద్రంలో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సంఘాల మహిళలకు బాల్యవివాహాలు, చైల్డ్ లేబర్, చైల్డ్ అబ్యూజ్ గురించి అవగాహన కల్పించారు. పిల్లలను తల్లిదండ్రులు వారికి ఒక వయస్సు వచ్చాక ప్రేమతో చూడాలని, లేకుంటే వారు తప్పు దారిలో వెళ్తారని పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, డీఎల్ఎస్ఏ 15110 కు ఫోన్ చేయాల ని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ స్వర్ణలత, డీసీపీ స్రవంతి, తహసీల్దార్ గంగాసాగర్, సాధన కో–ఆర్డినేటర్ గిరిజ పాల్గొన్నారు.

కార్మికులందరూ సభ్యత్వం తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 10: నిజమైన కార్మికులు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. మండల పరిధిలోని భిక్నూర్ గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజమైన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో డబుల్‌బెడ్ రూం ఇండ్లను ఇవ్వాలన్నారు. ప్రతి మండలంలో 500 గజాల స్థలాన్ని కేటాయించి కమిటీహాల్ నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సాయిబాబు, ఆంధ్రయ్య, జయరాజ్, ప్రకాశ్, సాయిలు, సురేందర్, లక్ష్మణ్, నర్సింహులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో స్టాఫ్‌నర్స్‌లను నియమించాలి

ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 10: వసతి గృహాల్లో విద్యార్థులకు అందుబాటులో స్టాఫ్‌నర్స్‌లను నియమించాలని బీఎస్పీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కా ర్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు బీఎస్పీ విద్యార్థి విభాగం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో పిల్లలకు జలుబు, కడుపునొప్పి, దగ్గు, జ్వరం తదితర అనారోగ్యాలు వచ్చినప్పుడు పిల్లల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి, వారిని పిలిపించి వారితో పంపిస్తున్నారన్నారు. అందువల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా వసతిగృహాల్లో స్టాఫ్‌నర్స్‌లను నియమించాలని పేర్కొన్నారు.